

విద్యార్థులతో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

# విద్యతోనే ఉజ్వల భవిష్యత్

## బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, ఫిబ్రవరి 7 : విద్యలో రాణిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం నేరడిగొండ మండలంలోని వాంకిడి గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాల ఆవరణతో పాటు తరగతి గదులను పరిశీలించారు.విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి వాంకిడి గ్రామం పేరు నిలబెట్టాలన్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు గ్రామంలో పర్యటించి గ్రామస్తుల సమస్యలు తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తాను ఎప్పుడూ కృషి చేస్తూనే ఉంటానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను స్థానిక మైనార్టీ నాయకులు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు రాథోడ్ సజన్, నిమ్మల ప్రీతం రెడ్డి, తుల శ్రీనివాస్, ఇచ్చోడ ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమల్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాజు, వీడీసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ రాథోడ్ రవీందర్, నాయకులు జాదవ్ గణేశ్, భరత్, నజీర్, రాహుల్, గ్రామస్తులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పార్టీ పరంగా ఇస్తామనడం సరికాదు




తలమడుగు, ఫిబ్రవరి 7 : సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో బీసీలకు కాంగ్రెస్ పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని చెప్పడం సరికాదు. రిజర్వేషన్లకు చట్ట బద్ధత తీసుకువస్తే 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి బీసీలకు న్యాయం చేయాలి. మోసం చేయాలని చూస్తే అస్సలు ఊరుకోం.

- రాగి రాంకిషన్, బీసీ నాయకుడు, సాయిలింగి, తలమడుగు

# హామీ ఇచ్చి.. హ్యాండిచ్చి..

● మోసం చేస్తే ఊరుకోం



## బీసీ రిజర్వేషన్లపై మాట మార్చిన కాంగ్రెస్‌పై నాయకుల ఫైర్

### అది ముమ్మాటికీ తప్పుడు సర్వే అని మండిపాటు

### 42 శాతం అమలు చేయాల్సిందేనని డిమాండ్

ఆదిలాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ) : ''కాంగ్రెస్ ఎన్నికల సమయంలో బీసీల రిజర్వేషన్లు 42 శాతం పెంచుతామని హామీ ఇచ్చింది. ఇప్పుడేమో హ్యాండిస్తున్నది. అధికారంలోకి రాకముందు చెప్పిందేమిటి? ఇప్పుడు చేస్తున్నదేమిటి?' అంటూ బీసీ సంఘాల నేతలు ఫైర్ అవుతున్నారు. రిజర్వేషన్ల పేరిట తమను మోసగించిందని నిప్పులు చెరుగుతున్నారు. కులగణన నివేదిక తప్పులతడకగా రూపొందించారని, ఉద్దేశపూర్వకంగా బీసీ జనాభాను తగ్గించి చేసి చూపారని మండిపడుతున్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో భాగంగా బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాల్సిందేనంటూ డిమాండ్ చేస్తున్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో 51 శాతం ఉన్న బీసీలు పదేళ్లలో పెరగాలి కానీ, తగ్గడం ఏమిటని నిలదీస్తున్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు విషయంలో ఎక్కడా చిత్త శుద్ధిని ప్రదర్శించడం లేదని, తప్పుడు లెక్కల నివేదికను అసెంబ్లీలో చర్చకు పెట్టి, తీర్మానాన్ని కేంద్రానికి పంపించి చేతులు దులుపుకునే ప్రయత్నం చేసిందని ఆరోపిస్తున్నారు. బీసీ కులగణన నివేదిక తమ ఉనికికి ప్రమాదకరంగా మారిందని, వెంటనే దీనిని రద్దు చేసి రీ సర్వే చేయాలనే డిమాండ్ చేస్తున్నారు.

### బీసీలను మోసం చేసిన రేవంత్ రెడ్డి



తలమడుగు, ఫిబ్రవరి 7 : బీసీలను సీఎం రేవంత్ రెడ్డి మోసం చేసిండు. తప్పుల తడకగా బీసీల సర్వే నిర్వహించి 46 శాతం బీసీలు ఉన్నారని లెక్కలు చూపెట్టిండు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేసిన ఇంటింటి సర్వేలో 51 శాతం బీసీలు ఉన్నారని అప్పటి అధికారులు రిపోర్టు ఇచ్చిండ్రు. 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి. అమలు చేయకుంటే ఎన్నికలను అడ్డుకుంటాం.

- మంగదుడ్ల శ్రీనివాస్ యాదవ్, బీసీ నాయకుడు, వడూర్, భీంపూర్



### బీసీ డిక్లరేషన్‌కు కట్టుబడి ఉండాలి



తలమడుగు, ఫిబ్రవరి 7 : ఎన్నికలకు ముందు సీఎం రేవంత్ పీసీసీ హోదాలో కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ సభను ఏర్పాటు చేశారు. బీసీ బిడ్డ కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధారామయ్య చేతుల మీదుగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేశాక ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఇప్పుడు రిజర్వేషన్ల మీద గందరగోళం ఏర్పడింది. స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు కనిపిస్తుంది. మమ్మల్ని మోసం చేస్తే ఊరుకునేది లేదు. బీసీలకు అవమాన పరిస్తే బీసీ తడాఖా ఏమిటో స్థానిక ఎన్నికల్లో చూపిస్తాం.

- వినోద్, బీసీ నాయకుడు, అర్లి(కే), తలమడుగు



భూమి పూజ చేసి పనులు ప్రారంభిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

# ఆధ్యాత్మిక భావాలు గల వ్యక్తి కేసీఆర్

## మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, ఫిబ్రవరి 7 : తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఆధ్యాత్మిక భావాలు కలిగిన వ్యక్తి కేసీఆర్ సీఎం అయ్యారని, హైందవ ధర్మ పరిరక్షణకు ఎంతో కృషి చేశారని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని 12వ వార్డు పరిధిలోని శ్రీనగర్ కాలనీలో నిర్మించే శ్రీరాధాకృష్ణ ఆలయానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ సీఎం చేయని విధంగా కేసీఆర్ తెలంగాణలో యాగాలు, యజ్ఞాలు చేశారని గుర్తు చేశారు. హైందవ ధర్మాన్ని పరిరక్షిస్తూనే భావి తరాలకు ఆచరాలు, సంస్కృతి, సంప్రదాయం, సనాతన ధర్మాన్ని తెలియజేయాలని ప్రజలకు సూచించారు. ఆలయ నిర్మాణానికి తన వంతుగా పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను కాలనీ వాసులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పవన్ నాయక్, కాలనీ అధ్యక్షుడు లక్ష్మణ్, సంతోష్, విజయ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



డిపో ఎదుట నిరసన చేపడుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

# ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

భైంసా, ఫిబ్రవరి 7 : భైంసా పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట శుక్రవారం రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఆర్టీసీ ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేయాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొనాలని, కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలని, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జేఏసీ నాయకులు జీ. గంగయ్య, పీఎస్ కుమార్, రమణ, విశ్వనాథ్, లింగయ్య, సురేశ్, సుధాకర్, నివేదిత, శ్వేత, రాణి, తదితరులు పాల్గొన్నారు.



బావాపూర్(ఆర్)లో మావోయిస్టు శ్రీనివాస్ తల్లితో మాట్లాడుతున్న నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీషర్మిల

# మావోయిస్టు పార్టీని వీడాలి

● నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల

● బావాపూర్(ఆర్)లో 'పోరు కన్నా ఊరు మిన్న' కార్యక్రమం

ఖానాపూర్ రూరల్, ఫిబ్రవరి 7 : మావోయిస్టు పార్టీని వీడి జన జీవన స్రవంతిలో కలవాలని మావోయిస్టులకు నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల పిలుపునిచ్చారు. ఖానాపూర్ మండలంలోని బావాపూర్(ఆర్) గ్రామంలో 'పోరు కన్నా ఊరు మిన్న' అనే కార్యక్రమానికి ఎస్పీ హాజరయ్యారు. మావోయిస్టు పార్టీలో పని చేస్తున్న శ్రీనివాస్ ఇంటికి వెళ్లి ఆయన తల్లిని, కుటుంబ సభ్యులను ఎస్పీ కలిశారు. ఆమెకు రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కన్న కొడుకు శ్రీనివాస్‌ను ప్రాణం ఉన్నప్పుడే చూడాలని ఆ తల్లి కోరుకుంటున్నదని తెలిపారు. శ్రీనివాస్ మావోయిస్టు పార్టీని వీడి జనజీవన స్రవంతిలోకి వస్తే పునరావాసంతో పాటు అన్ని రకాల సహాయ సహకారాలను ప్రభుత్వం నుంచి అందించేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రాజేశ్‌మీనా, సీఐ సైదారావు, పోలీసులు పాల్గొన్నారు.

# మూగరోదన

**ఇష్టానుసారంగా పశువుల తరలింపు**

● మహారాష్ట్ర నుంచి రవాణా ● నిబంధనలు పాటించని దళారులు



ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో పశువుల విక్రయాలు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 7(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాలతోపాటు మహారాష్ట్ర నుంచి వివిధ రహదారుల మీదుగా మూగజీవాల రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్నది. కొందరు దళారులు నిబంధనలకు విరుద్ధంగా ఆవులు, దూడలు, ఎడ్లను తీసుకెళ్తున్నారు. ఒక్కో వాహనంలో 20 నుంచి 30 వరకు మూగజీవాలను కుక్కి హైదరాబాద్, ఇతర ప్రాంతాల్లోని గోవధశాలలకు తరలిస్తున్నారు. పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాలను డ్రైవర్లు మితిమీరిన వేగంతో నడపడంతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. జిల్లా మీదుగా వాహనాల్లో పశువుల రవాణా అధికంగా ఉంటుంది. ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో పశువుల విక్రయాలు జరుగుతాయి. జైనథ్, బేల, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, బోథ్, ఉట్నూర్ ప్రాంతాల్లో పశువుల సంత ఉంటుంది. . నాగ్‌పూర్ నుంచి జాతీయ రహదారి మీదుగా, చంద్రాపూర్, కాగజ్‌నగర్, ఉట్నూర్ మీదుగా, నాందేడ్ నుంచి బజార్‌హత్నూర్ మండలంలోని ఘన్‌పూర్ చెక్‌పోస్టు నుంచి కిన్వట్ నుంచి లక్ష్మీపూర్ చెక్‌పోస్టు మీదుగా పశువుల రవాణా కొనసాగుతోంది. లారీలు, వ్యాన్‌లు, ట్రక్కులతోపాటు ఇతర నాలుగు చక్రాల వాహనాల్లో పరిమితికి మించి వీటిని తీసుకుపోతున్నారు. ఒక్కో వాహనంలో 20 నుంచి 30 పశువులను కింద పడవేసి తాళ్లతో కట్టి తీసుకుపోతారు. ఆవులు, దూడలు, ఎద్దులను హైదరాబాద్‌తోపాటు ఇతర పట్టణాలకు తరలిస్తారు. పక్క రాష్ట్రంలోని యావత్మాల్, కిన్వట్, చంద్రాపూర్, మాడ్వి ప్రాంతాల నుంచి లారీ, వ్యాన్‌లలో ఎద్దులు, ఆవులు, లేగ దూడలు ఊపిరాడకుండా కట్టివేసి రవాణా చేస్తున్నారు. దళారులు మూగజీవాలను వాహనాల్లో తీసుకుపోవడంలో కనీస నిబంధనలు పాటించడం లేదు. వాహనాల్లో కుక్కి, పడుకోబెట్టి పైన టార్పాలిన్ కవర్లు కప్పి వందల కిలోమీటర్ల దూరం నుంచి ఇష్టానుసారంగా తరిస్తుండడంతో పశువులు ఊపిరాడకం, గాయాల బారిన పడి మరణిస్తున్నాయి. మహారాష్ట్ర నుంచి జాతీయ రహదారి మీదుగా, ఇతర మార్గాల గుండా పోయే వాహనాలు ఎక్కువ స్పీడ్‌తో వెళ్తుండడంతో జిల్లాలోని పలుచోట్ల పశువుల వాహనాలకు ప్రమాదాలు జరిగాయి.

**రవాణాకు ప్రత్యేక వాహనాలు ఉండాలి..**

నూతన రవాణా చట్టం ప్రకారం మూగజీవాలను తరలించేందుకు ప్రత్యేక రిజిస్ట్రేషన్ కలిగిన వాహనాలు ఉండాలి. ఈ వాహనాల్లో పశువులను తీసుకుపోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి. ఒక్కో పశువుకు 3 మీటర్ల దూరం ఉండాలి. కేవలం రాత్రి సమయంలో మాత్రమే పశువులను తీసుకుపోవాలి. పశువులను ఆరు గంటలకు మించి రవాణా చేయరాదు. ఈ సమయం దాటితే పశువులను అనువైన ప్రదేశాల్లో దించి మేత, నీరు అందించాలి. పశువులను రవాణా చేయడంలో సంబంధిత శాఖల అధికారుల ధ్రువీకరణ పత్రాల తప్పనిసరిగా ఉండాలి. ఎక్కడి నుంచి ఎక్కడికి తీసుకుపోతున్నారు, ఎవరు, ఎవరికి విక్రయిస్తున్నారనే వివరాలు తెలియజేయాలి. ఆవులు, దూడల రవాణాలో నిషేధం ఉండగా, వ్యవసాయానికి పనికిరాని ఎద్దులను రైతులకు మాత్రమే విక్రయించాలి. ఇందుకు పశుసంవర్ధక శాఖ అధికారులు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి. పశువుల రవాణాలో దళారులు నిబంధనలు పాటించడం లేదు. ఎలాంటి పత్రాలు లేకుండానే యథేచ్ఛగా రవాణ చేస్తున్నారు. ఆదిలాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో పశువుల విక్రయాలపై అధికారుల పర్యవేక్షణ లోపించింది. మార్కెటింగ్ పశుసంవర్ధక, రవాణ, పంచాయతీ శాఖల అధికారులు పశువుల విక్రయాలను పర్యవేక్షించాల్సి ఉండగా, ఎవరూ పట్టించుకోకపోవడంతో మూగజీవాల రవాణ యథేచ్ఛగా సాగుతున్నది.



సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

# వంద శాతం ఇంటిపన్ను వసూలు చేయాలి

## నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 7: గ్రామాల్లో వందశాతం ఇంటి పన్ను వసూలు చేయాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వేసవిలో నీటి ఎద్దడి నివారణ చర్యలు, ఇంటిపన్ను వసూలు, వన మహోత్సవం తదితర అంశాలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటిపన్ను వసూలును పూర్తి చేయాలని ఆదేశించారు. వేసవి దృష్ట్యా ప్రత్యేక కార్యాచరణతో గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ చేతిపంపులు, బోరుబావుల పనితీరును పర్యవేక్షించి అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలన్నారు. గ్రామాల్లో అన్ని రకాల వ్యాపారుల వాణిజ్య లైసెన్సులను వంద శాతం పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పలు అంశాలపై సూచనలు చేశారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ హయాంలో రోడ్డు డివైడర్ మధ్యలో పచ్చగా ఆహ్లాదకరంగా మొక్కలు

# నాడు కళకళ.. నేడు వెలవెల

*నిర్మల్ జిల్లా కేంద్రంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి ప్రణాళికలో భాగంగా నిర్మించిన ప్రధాన రహదారి వెడల్పు పనులు, మధ్యలో నిర్మించిన డివైడర్లు, వాటి మధ్యలో మొక్కలు నాటి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. మొక్కల సంరక్షణకు ప్రత్యేకంగా బోర్‌వెల్ ఏర్పాటు చేసి నీటివసతి కల్పించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో డివైడర్ల మధ్యలో మొక్కలు ఎండిపోయి కళావిహీనంగా మారాయి. డివైడర్లు పగిలిపోయి, బోర్‌వెల్ చెడిపోయి నీటి వసతి లేకుండాపోయింది. ఇప్పటి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పట్టించుకోకపోవడం లేదని నిర్మల్ పట్టణ ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి డివైడర్లకు మరమ్మతులు చేయించి, మొక్కలు నాటి సంరక్షించాలని కోరుతున్నారు.*

-నిర్మల్ ఫొటోగ్రాఫర్, ఫిబ్రవరి 7



నేడు ఎండిపోయిన మొక్కలు